క్లుప్తంగా

సేవా సంస్థకు దాతల విరాళం



సేవా సంస్థకు విరాళం అందజేస్తున్న రాంబాబు దంపతులు

దేవరపల్లి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థకు దాతలు విరాళాలు అందజేసి మేమున్నాం అంటూ నిర్వాహకులను ప్రోత్సహిస్తున్నారు. ఈ మేరకు చిన్నాయగూడెంకు చెందిన వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గడా రాంబాబు, ధనలక్ష్మి దంపతులు శుక్రవారం రూ.50 వేల విరాళాన్ని సంస్థ ప్రతినిధులకు అందజేశారు. తన తల్లిదండ్రులు వెంకట్రావు, బుల్లెమ్మ దంపతులు జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్టు రాంబాబు తెలిపారు. దంపతులను సంస్థ మండల అధ్యక్షుడు బండి సూర్య ప్రకాశరావు, సభ్యులు అభినందించారు.

క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలి

నిడదవోలు: యువత క్రీడలకు మొదట ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. రోటరీక్లబ్ ఆఫ్ నిడదవోలు ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని స్థానిక రోటరీ ఆడిటోరియంలో క్లబ్ అధ్యక్షుడు మీసాల శివరామ హరిప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. అనంతరం క్రీడల్లో రాణిస్తున్న జగతా దీక్షిత, పలువురు వ్యాయామోపాధ్యాయులను క్లబ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి దారపురెడ్డి ప్రతాప్, కోశాధికారి గుంటిపల్లి సత్యసాయి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

స్వామిత్వను పారదర్శకంగా నిర్వహించాలి




విజ్జేశ్వరంలో స్వామిత్వ సర్వేను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వరం గ్రామంలో స్వామిత్వ సర్వే తీరును కలెక్టర్ పి.ప్రశాంతి శుక్రవారం పరిశీలించారు. గ్రామ కంఠాల్లో ఇళ్లు, ఖాళీ స్థలాల రికార్డులను పక్కాగా తయారుచేసి అనుబంధ రికార్డులను నవీకరించాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ అధికారులు డేటా ప్రక్రియలో ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం లేకుండా యంత్రాంగం నిబద్ధతతో పనిచేయాలన్నారు. అనంతరం ఆన్‌లైన్‌లో నమోదుచేసిన సర్వేను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీఓ ఎ.స్లీవారెడ్డి, తహసీల్దార్ బి.నాగరాజునాయక్, ఎంపీడీఓ జగన్నాథరావు, సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట ఫలితంగానే పింఛన్ల పెంపు

నల్లజర్ల: మందకృష్ణ మాదిగ ఉద్యమ పోరాట ఫలితంగానే ఉమ్మడి రాష్ట్రంలో పింఛన్‌ల పెంపు సాధ్యమైందని తూర్పుగోదావరి జిల్లా వికలాంగుల పోరాటసమితి అధ్యక్షుడు భీమడోలు కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని శుక్రవారం దూబచర్లలో హక్కుల పోరాట సమితి ప్రారంభించి 18 సంవత్సరాల పూర్తయిన సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడు మార్లపూడి ఏసుదాసు అధ్యక్షతన వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి లక్ష్మీనారాయణ, నాగేశ్వరావు, అప్పారావు, ధెరిస్సా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్వారీ లారీలు సీజ్



టాస్క్‌పోర్స్ అధికారులు సీజ్ చేసిన లారీలు

పెరవలి: పెరవలి మండలం తీపర్రు ఇసుక ర్యాంప్ నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక లారీలు, రెండు మెటల్ లారీలను టాస్క్‌పోర్స్ (మైనింగ్ డిపార్టుమెంట్) పట్టుకుని పెరవలి పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం అప్పగించారు. ఈ మేరకు పెరవలి ఎస్సై యం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాలుగు లారీలను ప్రత్యేక ట్రాస్క్‌పోర్స్ తమకు అప్పగించారని వీటిని మైనింగ్ అధికారులకు అప్పగిస్తామన్నారు.

రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడికి సత్కారం

తాళ్లపూడి: తాళ్లపూడిలోని శ్రీ విజేత హైస్కూల్ వద్ద శుక్రవార తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించార. ఈ సందర్భంగా విద్యార్థులు గిడుగు చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు జె. ప్రమోద్ కుమార్ తాళ్లపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన కాలంలో తెలుగు ఉపాధ్యాయులుగా పనిచేసిన చామర్తి విశ్వనాథరావును గిడుగు సాహితీ పురస్కారంతో సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన తెలుగు భాషా ప్రాముఖ్యతను, ప్రాధాన్యతను వివరించారు.

కంద..గుది బండ

- పతనమైన ధరలతో నష్టాలపాలు
- పెరిగిన పెట్టుబడి భారం
- గత ప్రభుత్వంలో గిట్టుబాటు ధరలు



పెద్దేవంలో కందను తవ్వుతున్న కూలీలు

తాళ్లపూడి: ఆరుగాలం శ్రమించి పండించిన కంద రైతుల పరిస్థితి ధర లేక దయనీయంగా మారింది. కొన్నేళ్లుగా లాభాల నుంచి నష్టాల ఊబిలోకి రైతులు కూరుకుపోతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో ధర పతనం కావడంతో సాగు చేస్తున్న రైతులు కుదేలయ్యారు. సీజన్‌లో కందకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. పంట చేతికందే సరికి ధర సగానికి పడిపోవడంతో పెట్టుబడి సైతం దక్కే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో సుమారు 1,200 ఎకరాల్లో కంద సాగు చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది దిగుబడి బాగుననా మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో పెట్టుబడి కూడా రావట్లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇలా..

జిల్లాలో కంద పంట గతేడాది కంటే ఎక్కువ మొత్తంలో సాగు చేపట్టారు. గతేడాది ఎకంగా ఎవరు ఊహించని విధంగా పుట్టు కంద ధర రూ.11 వేలు పలకడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగింది. తాళ్లపూడి మండలంలో రావురుపాడు, పెద్దేవం, మలకపల్లి, బల్లిపాడు, కొవ్వూరు మండలంలో పెనకనమెట్టసావరం, చిడిపి, వాడపల్లి, వేములూరు, తోగుమ్మి, దొమ్మేరు, కాపవరం గ్రామాల్లో కందను అధికంగా రైతులు సాగు చేస్తున్నారు. గతంలో కౌలు కంద పంటకు ఎకరం రూ.60 వేలు ఉంటే ప్రస్తుతం రూ.80 వేలకు పెరిగింది. విత్తనాన్ని బీహార్, ఇతర ప్రాంతాల నుంచి తెచ్చి మరీ వేశారు. విత్తనం కందపుట్టు (250 కేజీలు) ధర రూ. 12,500 వేలు చెల్లించారు. ఎకరాకు 25 పుట్టుల విత్తనం నాటారు. ఈ లెక్కన ఒక్క విత్తనానికే రూ.3 లక్షల 50 వేలు వరకు ఖర్చయ్యింది.

లాభాల నుంచి నష్టాలకు..

ఇటీవల నెల రోజులుగా కంద ధరలు పతనమవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ముమ్మరంగా కంద తవ్వకాలు జరుగుతున్నాయి. గత నెలలో రూ.8 వేలు పలికిన పుట్టు కంద (250 కేజీలు) ధర ప్రస్తుతం రూ.6,500 వేలకు పడిపోయింది. టన్ను ధర రూ.26,000 గా ఉంది. గత సంవత్సరం కంద ధర బాగుందని రైతులు తెలిపారు. ప్రస్తుతం ఎకరాకు 60 నుంచి 80 పుట్టులు వరకు దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. రైతుకు ఎకరాకు పెట్టుబడి రూ.4.30 లక్షల వరకు ఖర్చయ్యింది.

దండుకుంటున్న దళారులు

సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో గిట్టుబాటు ధర లభించక కంద రైతులు నష్టాలను చవిచూడాల్సివస్తుందని రైతులు వాపోతున్నారు. పంట ఎగుమతులకు సంబంధించి వ్యాపారులే (దళారులు) కీలక భూమిక పోషిస్తున్నారు. దీంతో కంద ధరలపై నియంత్రణ కొరవడింది. ప్రస్తుతం ఈ ప్రాంతంలో పండిస్తున్న పంటను చెన్నై, బీహార్, కలకత్తా, ముంబాయి, ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్ తదితర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు.



కంద దుంపలను లోడు చేస్తున్న కూలీలు

ధరలను నియంత్రించాలి

నాలుగు ఎకరాల్లో అప్పుచేసి మరీ పెట్టుబడి పెట్టాను. ఎకరాకు 60 పుట్లు దిగుబడి వస్తుంది. ఇత్తనం కంద పుట్టు రూ.12,00 లకు కొన్నాను. ప్రస్తుతం పుట్టు ధర రూ.6,500 లకు పడిపోయింది. ప్రభుత్వం మార్కెట్ ధరలను నియంత్రించాలి.

–కొల్లిపల్లి మాధవరావు, రైతు, బల్లిపాడు



సాగు ఖర్చులు పెరిగిపోయాయి

ఎకరం పంట సాగుకి రూ.3 లక్షల వరకు ఖర్చయింది. బీహార్ నుంచి విత్తనం తెచ్చి మరీ వేశాం. ఈ ఏడాది వినియోగం తగ్గడంతో డిమాండ్ తగ్గి ధరలు పతనమయ్యాయి. తక్కువ నష్టంతో బయట పడ్డాను

–ఉప్పర శ్రీనివాస్, రైతు.రావూరుపాడు



లెక్కేసుకుని సిద్ధంగా ఉండండి



మద్దూరులంకలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీలో పాల్గొన్న తలారి వెంకట్రావు, నాయకులు

కొవ్వూరు: 'నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఎప్పుడాస్తావ్ బాబు' అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రశ్నించారు. మండంలోని మద్దూరులంకలో శుక్రవారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ గ్రామస్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో రచ్చబండ నిర్వహించి చంద్రబాబు హామీలు అమలు చేకుండా చేస్తున్న మోసాలను తలారి నాయకులతో కలిసి ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇవ్వడం వాటిని అమలు చేకుండా ముసలికన్నీరు కార్చడం చంద్రబాబుకు అలవాటేనన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ఉల్టా కొట్టించి వాటికి పేర్లు మార్చి అమలు చేస్తు అందులోను కోత విధిస్తున్నారని మండిపడ్డారు. మీ కుటుంబానికి కూటమి ప్రభుత్వం ఈ ఐదు సంవత్సరాల్లో ఎంత రావాలో లెక్కేసుకుని వచ్చే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని అడిగితే వారి నాలుక మందం అంటున్నారని, ఎవరి నాలుక మందమో వచ్చే ఎన్నికల్లో ప్రజలు తేల్చుతారని హితవుపలికారు. 2014–2019లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రైతులు, డ్వాక్రా మహిళలు సహ అన్ని వర్గాల ప్రజలను మోసం చేసారన్నారు. 2024 ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి సంపద సృష్టిస్తానని చెప్పి నేడు ఖజానాలో నిధులు లేవని, హామీలు అమలు చేయడం సాధ్యం కాదని చెప్పడం మోసం కాదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, మాజీ మండల కన్వీనర్ సుంకర సత్యనారాయణ, సర్పంచ్ బొలిశెట్టి దుర్గారావు, ఎంపీటీసీ దేవన సత్యనారాయణ, నాయకులు వాక్త రమేష్, కంచుమట్ల వెంకటారవు, పల్ల వెంకటరత్నం, తొర్లపాటి పాటి రాజేష్, తులసి, జంగా సూరిబాబు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలపై సభ్యుల ఏకరవు

- వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ భారతి వాకౌట్
- కలుషిత మంచినీరు సరఫరాపై ఆగ్రహం



హాజరైన కౌన్సిల్ సభ్యులు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ ఆదినారాయణ

నిడదవోలు: పట్టణంలో వివిధ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై కౌన్సిల్ సభ్యులు ఏకరవు పెట్టారు. వార్డులో అభివృద్ధి పనులు చేయడం లేదని మనస్థాపానికి గురైన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ భారతి సమావేశాన్ని బహిష్కరించి బయటికి వెళ్లిపోయారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన శుక్రవారం మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని 18వ అంశాన్ని మినహాయించి 21 అంశాలను కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సభ్యులకు వివరించారు. కౌన్సిలర్ కామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కౌన్సిల్ ఆమోదం లేకుండా, ఎవరికి చెప్పకుండా రహస్యంగా ఐదుగురిని (నాన్ పీహెచ్) అవుట్ సోర్సింగ్ వర్కర్లుగా తీసుకోవడంపై అభ్యంతరం తెలిపారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. 15 ఏళ్లుగా ట్రేడ్ లైసెన్సులు పెంచలేదని, పట్టణంలో చిరు వ్యాపారులు ఇబ్బంది పడేటట్లు ట్రేడ్ లైసెన్సులు పెంచితే మున్సిపాలిటీకి ఆదాయం సమకూరదని, మరో మార్గంలో మున్సిపాలిటీకి ఆదాయ మార్గాలు పెంచుకోవాలని ఆయన సూచించడంతో ఈ అంశాన్ని వాయిదా వేశారు.

పశువుల సంచారాన్ని నిర్మూలించాలి

మున్సిపల్ వైస్ చైర్మన్ యలగాడ బాలరాజు మాట్లాడుతూ పట్టణంలో కుక్కలు, పశువులు సంచారం పెరిగిందని నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందిరనగర్‌లో ఇటీవల వేసిన బోరు ద్వారా కలుషిత మంచినీరు వస్తుందని, బసివిరెడ్డి వద్ద పైప్ లైన్ లో లీకేజీతో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. దీనిపై మున్సిపల్ హేమంత్ శ్రీనివాస్ సమాధానం ఇస్తూ తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కౌన్సిలర్ దాకే అనిల్ కుమార్ మాట్లాడుతూ గతంలో చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమానికి మున్సిపల్ సాధారణ నిధులు వెచ్చించారని, ఖర్చుల వివరాలను చెప్పాలని గత కౌన్సిల్లో అడిగిన సరైన సమాధానం చెప్పలేదని ఆయన మండిపడ్డారు. దీనిపై కమిషనర్ టి.కృష్ణవేణి సమాధానం ఇస్తూ పూర్తి సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. పట్టణంలోని అన్నపూర్ణ నగర్‌లో రోడ్లు, డ్రైన్లు అధ్వానంగా తయారై ప్రజలు ఇబ్బందులు పడుతున్న పాలకవర్గం పట్టించుకోవడంలేదని మనస్థాపం చెందిన కౌన్సిలర్ ఆలమూరి భారతి కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి బయటికి వెళ్లిపోయారు. దీనిపై చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ కాంట్రాక్టర్ చనిపోవడంతో ఆలస్యం జరిగిందన్నారు. తక్షణమే చర్యలు తీసుకుని పనులు చేయిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ టి. కృష్ణవేణి, మున్సిపల్ డీఈఈ సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక అధికారి సుప్రియ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యతను నిర్మూలించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజమనోహర్

గోపాలపురం: నిరక్షరాస్యత నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎంపీడీవో గెల్లా రాజమనోహర్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఉల్లాస్ అక్షరాంధ్ర అక్షరాస్యతా కార్యక్రమంపై వలంటీర్లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీడీవో రాజమనోహర్ మాట్లాడుతూ మండలంలోని డ్వాక్రా, డ్వామా గ్రూపుల్లో ఉన్న నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించి వారిని అక్షరాస్యులుగా చేయాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. మండలంలోని 3,300మంది నిరక్షరాస్యులకు 330మంది వలంటీర్లను ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ నుంచి మార్చి వరకూ అక్షరాస్యతా కార్యక్రమం నిర్వహించాలని వలంటీర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారికె వెంకటరెడ్డి, జిల్లా వయోజనవిద్యా నోడల్ అధికారి కేవీవీ సత్యనారాయణ, ఏపీఎం కె.రమణ, ఏపీఓ క్లస్టర్ కోఆర్డినేటర్లు వలంటీర్లు పాల్గొన్నారు.

పరుగుల నాగాంజలి..అందరికీ స్ఫూర్తి



యాతం నాగాంజలి

నిడదవోలు: నిడదవోలు పట్టణంలోని అన్నపూర్ణ నగర్‌కు చెందిన యాతం నాగాంజలి మెగా డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో మహిళా విభాగంలో మొదటి ర్యాంకు సాధించింది. చిన్నతనం నుంచి సర్కారు స్కూళ్లలో చదువుతూ అథ్లెటిక్స్‌గా అనేక పతకాలు సాధించింది. ఆమె తన జీవన పోరాటంలో అనేక కష్టాలను అధిగమించింది. పట్టణంలో డాక్టర్ బీవీఎల్ఎన్‌రాజు మున్సిపల్ స్కూల్లో ప్రాథమిక విద్య, పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదువుకుంది. క్రీడల్లో ఆసక్తి చూపిస్తున్న నాగంజలి తల్లిదండ్రులు పీఈటీ నాగరాజు పర్యవేక్షణలో పరుగు పందెంలో శిక్షణ తీసుకొని అథ్లెటిక్స్‌లో అనేక పతకాలు సాధించింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో డీఎస్సీ ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో ప్రథమ స్థానం సాధించడంపై పట్టణ ప్రముఖులు అభినందిస్తున్నారు.

చిరస్మరణీయులు..గిడుగు రామ్మూర్తి

నల్లజర్ల: వ్యవహారిక తెలుగు భాషకు తగిన ప్రాముఖ్యత వచ్చేలా తెలుగు భాషకు పెద్దపీటవేసేలా కృషి చేసిన గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు చిరస్మరణీయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా దూబచర్ల ఎలైట్ కళాశాలలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 11 సంవత్సరాల చిన్నారి నారాయణం జాగృతి వేమన శతకం, సుమతీ శతకం 108 పద్యాలను అలవోకగా ఆలపించి సభికుల్ని విస్మయానికి గురిచేసింది.

ఆర్టీసీ సర్వీసులను పునరుద్ధరించాలి



డిపో మేనేజర్ ధనుంజయ్‌తో మాట్లాడుతున్న రాంబాబు

నిడదవోలు: నిడదవోలు ఆర్టీసీ డిపో పరిధిలో రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించాలని ఆర్టీసీ డిపో అభివృద్ధి సాధన పోరాట కమిటీ కన్వీనర్ జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపోలో సమస్యలు పరిష్కరించాలని నిడదవోలు ఆర్టీసీ డిపో మేనేజర్ టి.ధనుంజయ్‌ను శుక్రవారం కలిసి పలు సమస్యలను వివరించారు. నిడదవోలు–తణుకు బస్సు సర్వీస్ ఏర్పాటు చేయాలని, అమలాపురం, విశాఖపట్టణం రద్దుచేసిన సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని, ఆర్వోబీ నిర్మాణం వల్ల తాడేపల్లిగూడెం వెళ్లే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరారు.

అనధికార పొగాకు నారుమడులపై చర్యలు



వేళ్లచింతలగూడెంలో నారుమడులను పరిశీలిస్తున్న కీర్తి కుమార్

గోపాలపురం: పొగాకు బోర్డులో రిజిస్ట్రేషన్ కాకుండా అనధికారికంగా పొగాకు నారుమడులు ఏర్పాటు చేసి, అమ్మకాలు సాగిస్తే చర్యలు తప్పవని పొగాకు బోర్డు ప్రత్యేక అధికారి బీఎస్ కీర్తికుమార్ హెచ్చరించారు. మండలం వేళ్లచింతలగూడెం, పెద్దాపురం, చిట్యాల గ్రామాల్లో శుక్రవారం పొగాకు నారుమడులను అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీ దశ నుంచి రైతులు పొగాకు నారుమడులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. 1975లోని సెక్షన్ (10)2 ప్రకారం బోర్డులో నమోదు కాని రైతులు కాకుండా వేరే ఏ వ్యక్తులు నారుమడులు వేసి అమ్మకాలు సాగించరాదన్నారు. రైతులకు సీటీఆర్ఐ నుంచి విత్తనాలను ప్రభుత్వం సరఫరా చేస్తుందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట గోపాలపురం, పెద్దాపురం, చిట్యాల, వేళ్లచింతలగూడెం ఫీల్డ్ ఆఫీసర్లు రైతులు పాల్గొన్నారు.

నిలకడగా పొగాకు ధరలు

రూ.1,604 కోట్ల పొగాకు అమ్మకాలు



దేవరపల్లి వేలం కేంద్రానికి వచ్చిన పొగాకు బేళ్లు

దేవరపల్లి: పొగాకు మార్కెట్ నిలకడగా కొనసాగుతుంది. దాదాపు ఆగస్టు 8వ తేదీ వరకు మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ.370 పలకిన పొగాకు అనంతరం రూ.350 తగ్గి నిలకడగా కొనసాగుతుంది. 2024–25 పంటకాలంలో పండించిన పొగాకును మార్చి 24న కొనుగోళ్లు ప్రారంభించారు. ప్రారంభ గరిష్ఠ ధర కిలో రూ. 290 పలకగా ఈధర జూన్ 23 వరకు కొనసాగింది. దాదాపు 72 రోజులు ఈ ధర కొనసాగింది. అనంతరం ధర అంచెలంచెలుగా పెరుగుతూ జూలై 16న రూ. 392 పలికింది. కిలోకు సుమారు రూ.100 పెరగడంతో రైతుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించాయి. కౌలు రైతులు కూడా ఊపిరిపీల్చుకున్నారు. జూలై 25 వరకు కిలో గరిష్ఠ ధర రూ.290 పలకగా, 26 నుంచి రూ.370 పలికింది. ఈ ధర ఆగస్టు 8 వరకు కొనసాగి, ఆగస్టు 9న రూ.350 పడిపోయింది. కిలో రూ. 392 నుంచి 350 పడిపోవడంతో రైతులు కిలోకు దాదాపు రూ.42 నష్టపోయారు. ఆగస్టు 9వ తేదీ నుంచి పొగాకు ధర కిలో రూ.350 నిలకడగా కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

53.97 మిలియన్ల కిలోల విక్రయం

పొగాకు బోర్డు రాజమహేంద్రవరం రీజియన్ కార్యాలయం పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో శుక్రవారం నాటికి రూ.1604 కోట్ల విలువ గల 53.97 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగినట్టు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ తెలిపారు. ఈ ఏడాది మార్కెట్లో పొగాకు ధర ఆశాజనకంగా ఉన్నట్టు ఆయన వివరించారు. అంర్జాతీయ మార్కెట్లో పొగాకు డిమాండ్‌ను బట్టి ధర పలుకుతుందన్నారు.

వైభవోపేతంగా గణపతి నవరాత్రులు

తాళ్లపూడి: మండల వ్యాప్తంగా గణపతి నవరాత్రులు వైభవోపేతంగా కొనసాగుతున్నాయి. మూడోవ రోజు శుక్రవారం మండపాల్లో అర్చకులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వేగేశ్వరపురంలోని కాలువ గట్టు వద్ద =ఉన్న వినాయకుడి ఆలయం, తాళ్లపూడిలోని బస్టాండు సెంటర్, ప్రక్కిలంక, అన్నదేవరపేట, పెద్దేవం, పైడిమెట్ట, గజ్జరం, అన్నదేవరపేట, బల్లిపాడు, రావూరుపాడు, మలకపల్లి, తాడిపూడి తదితర గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు.

సీసీ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంలో 7వ వార్డులో ఆర్ అండ్‌బీ రోడ్డులో నిలిచిపోయిన డ్రెయిన్ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు మండల పరిషత్ నిధులు రూ.4 లక్షలతో సీసీ డ్రెయిన్ పనులకు సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ షేక్‌సూర్జాన్ కొబ్బరికాయలు కొట్టి పనులకు శంకుస్థాపనప చేసారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి

గోపాలపురం: సగ్గొండ పంచాయతీ ప్రథమ సర్పంచ్‌గా పనిచేసిన బొల్లిపో శ్యామ్‌సన్ శుక్రవారం గుండె పోటుతో మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని సర్పంచ్ యండపల్లి శేఖర్‌బాబు కొనియాడారు. భౌతిక కాయానికి మండలంలోని ఉపాధ్యాయులు, సగ్గొండ గ్రామస్తులు నివాళులర్పించారు.

రోడ్డుపై వర్షపు నీటితో ఇక్కట్లు

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేట గ్రామంలోని అరుంధతీ పేటలో నీరు బయటకు వెళ్లడానికి మార్గం లేక ఇళ్ల వద్దే నిలచిపోతుందని ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని కొడమంచిలి జాన్‌బాబు, పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నీరు బయటకు వెళ్లే దారిలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. డ్రైనేజీలను ఏర్పాటు చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు.

సీతాఫలం..ఆరోగ్యానికి బలం



మార్కెట్లో అమ్మకానికి వచ్చిన సీతాఫలాలు

దేవరపల్లి: సీజన్ వారీగా కనువిందు చేసే పండ్లలో సీతాఫలానికి చాలా ప్రత్యేకత ఉంది మధుర ఫలాలుగా అందరూ ఇష్టపడే ఈ పండ్లు ప్రస్తుతం సీజన్ ప్రారంభమవ్వడంతో మార్కెట్‌లో సందడి చేస్తున్నాయి. ప్రతి ఏటా ఆగస్టు నుంచి నవంబరు వరకు సీతాఫలాల సీజన్ ఉంటుంది. మామిడి పండ్లకు ఏమాత్రం తీసిపోని క్రేజ్ సీతాఫలాలది. మెట్ట ప్రాంతంలోని ఇసుక నేలల్లో పొలం కట్టువల్లో సీతాఫలాల చెట్లను పెంచుతారు. ఒక్కొక్క చెట్టు 100 నుంచి 200 కాయలు దిగుబడినిస్తాయి. క్లస్టర్ పరిధిలోని గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల, నల్లజర్ల, గోపాలపురం, దేవరపల్లి మండలాల్లో సాగు ఎక్కువగా చేస్తారు. పంటకు కాయదశలో వర్షాలు సమృద్ధిగా ఉండాలి. వర్షాలకు కాయలు పక్వానికి వచ్చి పండుగా తయారవుతాయి. ఔషద గుణం కలగిన ఫలం కావడంతో ధర ఎక్కువగా ఉన్నప్పటికి అధికంగా కొనుగోలు చేస్తారు. ఈ గ్రామాల నుంచి హైదరాబాద్, విజయవాడ, విశాఖ, బెంగుళూరు వంటి పట్టణాలు, బంధువులకు, స్నేహితులు పంపిస్తుంటారు. ప్రస్తుతం కాయ సైజును బట్టి 100 సీతాఫలాలు రూ.1,500 నుంచి 2,000 వరకు ధర పలుకుతున్నాయి. ధరలు సామాన్య, మధ్య తరగతి ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి.

ప్రకటన

మహారాజశ్రీ కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో మైనరు / వార్డు గుడిమెట్ల జస్వంత్
(పుట్టిన తేది 24-07-2013) & గుడిమెట్ల సాయి
(పుట్టిన తేది 20-08-2015)
G.W. O.P No. 33/2025

Between

శ్రీమతి గుడిమెట్ల హరిత కుమారి (ప్రతిపాదిత గార్డియన్) భర్త లేటు గుడిమెట్ల శ్రీనివాస్, యాదవోలు గ్రామం, దేవరపల్లి మండలము, తూ.గో జిల్లా .... పిటీషనర్

మరియు

– నిల్ – .... రెస్పాండెంట్.

పై నెంబరు గార్డియన్ పిటిషన్ ఓ.పి. లో పిటిషనర్/ వార్డు తాలుకా ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని విక్రయించగా వచ్చే ప్రతిఫలముతో పిటిషనర్/ వార్డు యొక్క అభివృద్ధి నిమిత్తం ఆనగా చదువు మరియు ఇతర అవసరముల నిమిత్తం వినియోగించుటకు, వగైర రిలీఫ్‌లు కోరుతు పై నెంబరు గార్డియన్ ఓ.పి. నెం. 33/2025 ను దాఖలు చేసియున్నారు. కావున సదరు ఓ.పి.లో ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు / అభ్యంతరములు వున్న యెడల, సదరు పిటిషన్ వాయిదా తేది. 03-09-2025 వ తేదిన ఉదయం గం. 10-30 ని.లకు పై కోర్టులో హాజరై తెలియజేసుకొనవచ్చును.

షెడ్యూలు: ప.గో. జిల్లా, ప్రస్తుతం తూ.గో. జిల్లా, అనంతపల్లి సబ్ రిజిస్ట్రారువారి చేరిన, దేవరపల్లి మండలం, యాదవోలు గ్రామం, ఆర్.యస్. నెం 790-1బి, దాఖలా వ్యవసాయ భూమి ఎ 0-86 1/2 సెంట్లు భూమి కి హద్దులు

తూర్పు: తుమ్మల కృష్ణారావు గారి భూమి.
దక్షిణం: గుడిమెట్ల రామారావు గారి భూమి.
పడమర: గుడిమెట్ల నాగయ్య గారి భూమి.
ఉత్తరం: ఆనిసెట్టి నాగేశ్వర రావు గారి భూమి.

స్థలం: కొవ్వూరు
తే.23.08.2025

కేశిరాజు వెంకట రాజకుమార్
పిటీషనర్ తరపు న్యాయవాది